
మహబూబాబాద్
మంగళవారం 28 నవంబర్ 2023



# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## రాబందులకిస్తే రాష్ట్రం రావణ కాష్టమే..

డోర్నకల్: తెలంగాణను మళ్లీ రాబందుల్లాంటి కాంగ్రెస్ నాయకులకు అప్పగించొద్దు. మళ్లీ రావణ కాష్టం అయితది. ధరణి పోర్టల్‌తో రైతులకు పది నిమిషాల్లో ఈజీగా రిజిస్ట్రేషన్ అవుతున్నయి. రైతులు భూమి భద్రత హక్కు పొందుతున్నరు. ధరణి తీసేయాలనే కాంగ్రెసోళ్లతో పైరవీకారుల రాజ్యం వస్తది. పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తే మళ్లీ రైతులకు గోస మొదలైనట్టే. కాంగ్రెసోళ్లు కౌలుదారు చట్టంతో రైతుల మధ్య కయ్యం పెట్టాలని చూస్తున్నరు. వాళ్లను నమ్మితే రైతులు ఆగమే, ఇబ్బందులు పడాల్సిందే? రైతులంతా ఏకమై కాంగ్రెసోళ్లను బంగాళాఖాతంలో కలుపాలి. రైతుబంధు, రైతుబీమా, 24గంటల కరెంట్ ఇచ్చి అన్ని విధాలా రైతును ఆదుకుంటున్న బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కే నా మద్దతు. రైతులందరు మంచి చేసే కేసీఆర్‌నే ఆదరించాలి.

**- బానోత్ వెంకన్న, రైతు, బొడ్రాయి తండా**

## ధరణి తీసేస్తే దళారుల రాజ్యం వస్తది..



దంతాలపల్లి: కాంగ్రెస్ ధరణిని తీసేసి మళ్లీ దళారుల రాజ్యం వస్తది. మళ్లీ రైతులను దోపిడీ చేయాలని చూస్తున్నట్లు కనిపిస్తున్నది. ధరణిని తీసేస్తే రైతు ఆగమైతడు. ఇది వచ్చాకే మా భూములు ఇతరుల పేర బదలాయింపు చేయకుండా భద్రత వచ్చింది. గతంలో పటేల్, పట్వారీ వ్యవస్థతో కూడిన రెవెన్యూ విధానం వల్ల రైతులు అనేక కష్టాలు పడ్డారు. వారికి తెలియకుండానే రికార్డుల్లో పేరు మార్చేవారు. దీని వల్ల రైతు తన పేరు మార్చుకోవడానికి పటేల్, పట్వారీ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా పనయ్యేది కాదు. రెవెన్యూ వ్యవస్థ ఉన్న సమయంలో బలం ఉన్నోనిదే రాజ్యం. రైతు తన చేతకాక పొలాన్ని కౌలుకు ఇస్తడు. అప్పుడు రికార్డులో కౌలుదారు పేరు నమోదు చేస్తవు. అలాచేస్తే భూమిపై అసలు రైతు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది. కాంగ్రెస్ నాయకులు సోయి తప్పి మాట్లాడుతున్నరు. గతంలో ఎవరైనా భూమిని కొనుగోలు చేస్తే రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజంతా ఉంటేనే డాక్యుమెంటేషన్ పూర్తయ్యేది. దాన్ని రెవెన్యూ అధికారులకు అందించి దళారుల ద్వారా ముడుపులు అప్పజెప్పి నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగితే గాని మ్యుటేషన్ చేసేది. ధరణి వచ్చిన తర్వాత ఆ తిప్పలన్నీ తప్పినయి. స్లాట్‌బుక్ చేసుకొని సమయానికి వెళ్తే 15 నిమిషాల్లోనే పట్టా మార్పిడి చేసి సంబంధిత కాగితాలను మన చేతికి ఇస్తున్నారు. ఎవరికీ ఒక్క పైసా ఇవ్వకుండానే పని పూర్తవుతుంది. అంతమంచి ధరణిని రద్దు చేస్తామనడం సరికాదు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఓటెవరికి వేయాలో రైతులు నిర్ణయించుకోవాలి.

**- కొరిపెల్లి ఉదయ్, రైతు, దంతాలపల్లి**

## 10హెచ్‌పీ మోటర్లతో ఎవుసం ఎట్ల చేత్తం..



పెద్దవంగర: కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే రైతులు నట్టేట మునుగుతరు. 10హెచ్‌పీ మోటర్లతో ఎవుసం ఎట్ల చేత్తం. 3గంటల కరెంట్‌తో ఎవుసం చేయడం కష్టమే. కాంగ్రెసోళ్లు చెప్పినట్టు 10హెచ్‌పీ మోటర్లు పెడితే ఎంత కరెంట్ కావాలె. మోటర్లు కొనడానికి ఎన్ని వేలు కావాలె? కాంగ్రెసోళ్లు ఎప్పుడైన ఎవుసం చేసిండ్రా? రైతుల ఉసురు పోసుకోవడానికే గిట్ల మాట్లాడుతుండ్రు. 24గంటల కరెంట్ ఇస్తేనే వీలైనప్పుడు మోటరు పెడ్తం. కేసీఆర్ ఏం చేసినా ఆలోచించి చేస్తడు. ఇప్పుడున్న ప్రభుత్వంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటలు మంచిగ పండుతున్నయ్. గిప్పుడు గీ కాంగ్రెసోళ్లు వచ్చి రైతులను ఇబ్బందులు పెట్టేందుకు కుట్రలు చేస్తున్నరు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వానికే మా మద్దతు.

**- జలగం ముత్తయ్య, రైతు, పెద్దవంగర**

## బావుల కాడనే ఇక పండుడైతది..




పెద్దవంగర: కాంగ్రెసోళ్లు చెప్పిన 3గంటల కరెంటంటే బావుల కాడనే పండుడైతది. గిప్పుడు సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఇస్తున్న 24గంటల కరెంట్‌తోనే సాగు మంచిగ చేసుకుంటున్నం. ఇగ 3గంటల కరెంటంటే ఇగ ఎవుసం బంద్ చేసుడే అయితది. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుడు సాధ్యం కాదు. పెట్టిన ట్రాన్స్‌ఫార్మర్లు కాలుడే ఉంటది. అన్నితీర్ల మంచిగ చేస్తున్న కేసీఆర్ సర్కార్‌ను కాదని ఎవరినో ఎందుకు ఎన్నుకుంటరు. రైతులంతా ఆయన వెంటే ఉంటం. మళ్ల కేసీఆర్ సర్కారే వస్తది. మేమందరం కేసీఆర్‌కే ఓటు వేస్తం.

**- కసరబోయిన అంజయ్య, రైతు, కొరిపెల్లి**

# కాంగ్రెస్ వస్తే మళ్లీ వలసలే..

- ధరణి లేకుంటే భూములకు భద్రత ప్రశ్నార్థకం
- పెరిగిన భూముల ధరలు మళ్లీ పతనం
- కరెంటు లేకుంటే గణనీయంగా తగ్గిపోనున్న సాగు విస్తీర్ణం
- ఎత్తిపోతల పథకాలకు మంగళం?
- ధైర్యంగా బతుకుతున్న రైతులు ఆగం
- అన్నిరంగాలు.. అందరిపైనా ప్రభావం




## గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

మహబూబాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం శక్తివంచన లేకుండా వ్యవసాయరంగ అభివృద్ధి కోసం చేసిన కృషితో భుముల ధర అమాంతం పెరిగిందనేది జగమెరిగిన సత్యం. అయితే కాంగ్రెస్ చెబుతున్న మాటలు చూస్తుంటే మళ్లీ వ్యవసాయరంగం కుదేలయ్యేలా ఉందని, రైతులు ఆత్మస్థయిర్యం కోల్పోయే ప్రమాదముందనే అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. నిరంతర కరెంటు పోయి, 10హెచ్‌పీ మోటర్లు వచ్చి ధరణి ఎత్తేసి, కౌలుదారు కాలమ్ వచ్చి, రైతుబంధుపై నీలినీడలు కమ్మితే రాష్ట్రంలో భూముల ధరలు పడిపోతాయని, ధరణి లేకుంటే భూములకు రక్షణే లేకుండా పోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. తిరిగి పట్వారీల అజమాయిషీ వస్తే రైతుల్లో భూములపై ఇప్పుడున్న ధీమా పోతుందని, కౌలుదారు కాలమ్ భయంతో స్వయంగా వ్యవసాయం చేయలేనివారు భూమిని బీడు పెడుతారు తప్ప కౌలుకు ఇవ్వరని, ఫలితంగా సాగు పడిపోతుందని రైతుసంఘాల నాయకులు అంటున్నారు.

సాగు తగ్గిపోతే ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుందంటున్నారు. గ్రామాల్లో 70శాతం వ్యవసాయం మీద ఆధారపడ్డ కుటుంబాల వారు ఆదాయం కోల్పోతారని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని చెబుతున్నారు. మూడు గంటల కరెంటు వల్ల సాగుకు నీరు సరిపోక ఈ రకంగా చూసినా సాగు విస్తీర్ణం మీద దెబ్బపడుతుందని స్పష్టం చేస్తునారు. 10హెచ్‌పీ మోటర్ల వల్ల రైతులమీద అదనపు భారం పడుతుందని వాపోతున్నారు. రైతుబంధులో కౌలుదారులు, రైతుల పంచాయితీలతో గ్రామాల్లో శాంతిభద్రతల ముప్పు వాటిల్లే ప్రమాదముందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కరెంటు తీసేయడం, భూమికి భద్రత లేకుండా చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం, సాగు విస్తీర్ణం పడిపోవడం ద్వారా భూముల ధరలు పతనమవుతాయని అంటున్నారు. ఇప్పుడు రెండు, మూడెకరాల రైతులకు కూడా భూముల ధరలు ఎంత భరోసాను, ధీమాను ఇస్తున్నాయని, ఫలితంగా రైతు ఆత్మహత్యలు ఆగిపోయాయని, గతంలో భూములకు పెద్ద ధరలు లేక కొద్దిపాటి అప్పులకు కూడా భయపడి ఆత్మహత్యలకు పాల్పడేవారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు భూముల ధరలు పెరిగాక అప్పులమీద భయం పోయిందని, రైతుల్లో ధీమా వచ్చిందని చెబుతున్నారు. ధరలు మళ్లీ పాతరోజులు వస్తాయని అంటున్నారు. తెలంగాణలో చిన్న కమతాలున్న కుటుంబాలవారు అనేకమంది దూరంగా ఎక్కడో ఉద్యోగాలు చేసుకుంటూ గ్రామాల్లోని తమ భూములను కౌలుకిచ్చి వ్యవసాయం చేయిస్తున్నారని, అంతే తప్ప కౌలుకు ఇచ్చే రైతులంతా వందల ఎకరాలున్న వారేం కాదని, చిన్న, మధ్యతరగతి ఉద్యోగులను ఈ సమస్యలన్నీ చుట్టుముడితే చిరుద్యోగులకు ఎంతో కొంత ఆసరా అయ్యే ఈ అదనపు ఆదాయం కూడా కోల్పోతారని అభిప్రాయపడుతున్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోతే మళ్లీ వలసలు మొదలవుతాయని, రైతుకిచ్చే కరెంటునే కుదించే కాంగ్రెస్, కోట్ల రూపాయలు పోసి ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో నడిపిస్తుందా? అని ప్రశ్నిస్తున్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కోసం దాదాపు 10వేల కోట్ల దాకా విద్యుత్ సంస్థలకు సబ్సిడీ ఇస్తున్నారని, కాంగ్రెస్‌కు ఇంత సొమ్ము ఇచ్చే గుండె ధైర్యం ఉంటుందా? అనేది ప్రశ్నార్థకమేనంటున్నారు. పదేండ్ల కాలంగా కేసీఆర్ కష్టపడి నిర్మించిన గ్రామీణ వ్యవస్థ దెబ్బతింటుందని, ఈ వ్యవస్థను నిలబెట్టేందుకు చెరువులు, కుంటలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం, విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాటు చేసిన వ్యవస్థ, గోదాముల నిర్మాణం, మార్కెట్ యార్డుల విస్తరణ, రైతువేదికల శిక్షణ సమాచార వ్యవస్థ అన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతాయంటున్నారు. ఒక్కొక్కటిగా పేర్చి నిర్మించిన వ్యవస్థ కుప్పకూలుతుందని ఆందోళన చెందుతున్నారు.



## భూముల విలువ పడిపోతుంది..

నర్సంపేట, నవంబర్ 27 : రైతులు, కౌలు రైతులకు మధ్యన వివాదాలు వస్తాయి. రైతుబంధును కౌలు రైతులు, రైతుల్లో ఎవ్వరికైనా ఒకరికే ఇస్తామని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. దీని వల్ల రైతులు, కౌలు రైతులుకు మధ్య గొడవలు జరిగి, శాంతిభద్రతల సమస్యలు ఏర్పడతాయి. కరెంటు మూడు గంటలే ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. కాంగ్రెస్ నాయకులను నమ్మి రైతులు వ్యవసాయం చేయలేరు. రైతుల భూములకు విలువ కూడా బాగా తగ్గిపోతాయి. సీఎం కేసీఆర్ పాలనలోనే పుష్కలంగా సాగునీరు, విద్యుత్‌తో పాటు రైతుబంధు ఇవ్వడంతో భూములకు విలువ పెరిగి, రైతులు భరోసాతో బతుకుతున్నారు. రైతుబంధుతో రైతులకు ఎంతో ఉపయోగపడింది. ఇప్పుడు ధరణి ఎత్తేస్తామని, సీఎం కేసీఆర్ డబ్బులను వృథా చేస్తున్నారని అంటున్నారు. ఇలా కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం కరెక్ట్ కాదు. దీని వల్ల నష్టపోయేది రైతులే. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పాలి. రైతులందరూ బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలి.

**- కొమ్ము రమేశ్‌యాదవ్, న్యాయవాది**



## కుట్రల రేవంత్‌కు గట్టిగనే బుద్ధి చెప్తం

నర్సింహులపేట: కాంగ్రెసోళ్లు రైతుల మీద కుట్రలు జేయాలని చూస్తే గట్టిగనే బుద్ధి చెప్తం. మునుపు ఆ పార్టీవోళ్లు ఉన్నప్పుడు కరెంటు కోతలతోటి అరిగోస పడ్డం. ఏనాడూ కంటినిండ నిద్రపోలే. మల్ల కష్టాలు వద్దు బిడ్డా. మూడు గంటల కరెంటు ఇస్తే తడిసిన పొలమే మళ్లమళ్ల తడుస్తది. ఇప్పుడు 24గంటల కరెంటుతో పొలాలు మంచిగ పండుతున్నయ్. 24గంటల కరెంటుతో ఎప్పుడు వీలుంటే అప్పుడు పోయి మోటర్ ఏసుకొని పంటలకు నీళ్లు పెట్టుకుంటున్నం. రైతులను సీఎం కేసీఆర్ సారు రాజును జేసిండు. అందుకే మళ్ల కేసీఆర్ సర్కారే రావాలె. అప్పుడే అన్ని వర్గాల వారు సంతోషంగా ఉంటరు. నేను మాత్రం కేసీఆర్ సారుకే ఓటు వేస్త.

**- ఇర్రి సోమయ్య, రైతు, పడమటిగూడెం**



## భూ 'మేత' వస్తే మా బతుకులు ఆగమైతయ్

ఇనుగుర్తి: కాంగ్రెస్‌సోళ్లను నమ్మితే మా బతుకులు ఆగమైతయ్. ధరణిని తీసేసి భూమాతను తీసుకొస్తరట. అట్ల జేస్తే మా రైతుల బతుకులు రోడ్డున పడుతయ్. ధరణితో మా భూములకు భద్రత ఏర్పడింది. కాంగ్రెస్‌సోళ్లు వస్తే ఊర్లలో పట్వారీ వ్యవస్థ మొదలై దళారులు పుట్టుకొస్తరు. అట్ల ఐతే మా రైతులం మళ్లీ రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరుగుడు ప్రారంభమైతది. సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌లో నమోదైన భూములకు పంట పెట్టుబడి సాయం కింద ఏటా ఎకరానికి రూ. 10వేలు ఇస్తాండు. మళ్లీ గెలిచాక రూ. 16వేలకు పెంచుతడట. మరి ధరణిని తీసేస్తే మాకు రైతుబంధు ఎట్ల ఇస్తరు? ఏది ఏమైనా ధరణిని కొనసాగించాలి. కేసీఆర్‌ను మళ్లీ గెలిపించుకుంటం.

**- సపావట్ వెంకట్రామ్‌నాయక్, కాసిరాంతండా**

## రైతు గోస పట్టని కాంగ్రెస్‌ను నమ్మేదెవరు?



కురవి: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు గోస మళ్లీ పగోడికి కూడా రావొద్దు. కాంగ్రెసోళ్లకు రైతు సమస్యలు తెలుసా? రైతు కష్టాలు తెలుసా? రైతుకు సాయం చేయాలనేది మనసులో నుంచి రావాలి. సీఎం కేసీఆర్ రైతుబంధు పెట్టినప్పుడు ఎన్నికలు లేవు. రైతుబీమా పెట్టినప్పుడు ఎన్నికలు లేవు.. అదీ సీఎం కేసీఆర్ అంటే. అధికారం కోసం ఎన్నికలు వచ్చినప్పుడు రైతుకు అది చేస్తం, ఇది చేస్తమంటే కాంగ్రెస్‌ను నమ్మేదెవరు. సాగునీటి కోసం సీఎం కేసీఆర్ పడిన తండ్లాట రైతులందరికీ తెలుసు. ప్రపంచం అంతా కరోనాతో హడలి సత్తుంటే.. రైతు బంధుతోపాటు మద్దతు ధర ఇచ్చి ఆదుకున్న మహానుభావుడు కేసీఆర్. ఆ రోజులను రైతు మరిచిపోడు. మా ఊళ్లో పెద్ద సబ్‌స్టేషన్ ఉంటుంది. కానీ అప్పట్లో మా పరిస్థితి మరీ ఘోరంగా ఉండేది. రాత్రిపూట కరెంటు వస్తదని పోతే వస్తదా..? రాదా..? అని అడుగుదామంటే తెలియదు. కేసీఆర్ వచ్చినంక కరెంటు పోయిన రోజులు లేవు. మూడు గంటల కరెంటుతో మడి కూడా తడవదు. వ్యవసాయం మీద అవగాహన ఉంటే రైతు కష్టాలు తెలిసినోళ్లు మూడు గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటరు గురించి మాట్లాడరు. సీఎం కేసీఆర్ ఉన్నన్ని రోజులు తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఆయన వెంటే ఉంటరు. కారును మరవరు.. కాంగ్రెస్‌ను తలవరు.

**- వడ్లకొండ వీరమల్లు, రైతు, అయ్యగారిపల్లి**



## కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంట్ కష్టాలే

కేసముద్రం: రైతులకు మూడు గంటల కరెంట్ ఇస్తే మూరెడు పొలం కూడ పారదు. ఆ ఇచ్చే మూడు గంటలు పగలు ఇస్తడా? రాత్రి ఇస్తడా? చెప్పలేదు. 10హెచ్‌పీ మోటర్లతో నష్టమే తప్ప లాభం ఉండదు. 3 గంటల కరెంట్‌లో రైతులందరూ మోటర్లు ఆన్‌చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు పటాకుల్లెక్క పేలిపోతయి. కాంగ్రెస్ పాలించిన టైంలో ఎవుసానికి నీళ్లు పెట్టేందుకు పోయి కరెంటు ఎప్పుడొత్తదో తెల్వక పొలం కాన్నే ఉండేటోళ్లం. ఎంతోమంది పాముకాటు, కరెంటు షాకుకు గురై చనిపోయిన ఘటనలు ఉన్నాయి. కేసీఆర్ సర్కారు వచ్చినంకనే రైతుల బాధలన్నీ తీరినయ్. 24గంటల విద్యుత్ వస్తుండడంతో అవసరమైనప్పుడు, సమయానుకూలంగా పంటలకు నీరు పారిస్తున్నం. ఇన్నేండ్ల పాలనలో కేసీఆర్ తప్ప మరెవరూ రైతులను పట్టించుకోలేదు. పంటల పెట్టుబడికి ఎకరానికి రూ.10వేలు, మార్కెట్‌లో పంట ఉత్పత్తులకు ధర లేనప్పుడు మద్దతు ధర కల్పించి ఆదుకుంటున్నడు. మృతిచెందిన రైతుల కుటుంబాలకు రూ.5లక్షల బీమా అందించి ఆర్థికంగా అండగా ఉంటున్నడు. వ్యవసాయంతో పాటు ఇండ్లకు, పరిశ్రమలకు 24గంటల కరెంట్ ఇవ్వడం వల్ల ఎలాంటి ఇబ్బందుల్లేవు. రైతులందరూ సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలి.

**- మేకపోతుల రవీందర్‌రెడ్డి, రైతు, కేసముద్రం**

## పారిన మడే మళ్ల మళ్ల పారుతుండే..

దంతాలపల్లి: గతంలో కరెంట్ కష్టాలు చెప్పాలంటే రోజులే పడుతయ్. కరెంట్ ఎప్పుడొస్తదో.. ఎప్పుడు పోతదో తెలిసేది కాదు. త్రీఫేజ్ కరెంట్ ఉదయం, రాత్రి రెండు విడుతల్లో ఉండేది. గిప్పుడు మళ్ల కాంగ్రెసోళ్లు పాత పాట పాడుతున్నరు. 3గంటల కరెంట్ చాలంటున్నారు. గీళ్లకు రెండు ఎడ్లు పెట్టి పొలం పని చేయించాలె. గప్పుడయితేనే ఎవుసం ఎట్ల చేస్తరో తెలుస్తది. నీళ్లు పారకుంటే పొలం ఏం ఆయితదో తెలుస్తది. నోటికి ఏదోస్తే అది మాట్లాడుతున్నరు. ఇప్పుడు 24గంటల కరెంట్‌తో ఒక్క గుంట భూమి కూడా బీడుగా ఉండడం లేదు. తెలంగాణ రాకముందు కరెంట్ సరిగ్గా లేక భూములన్నీ బీడు ఉండేవి. దీంతో రైతులందరం ఎక్కడికెక్కడికో వలస వెళ్లేవాళ్లం. ఇప్పుడింక 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నరు. ఆ మోటర్లు పెట్టాలంటే రైతుల నెత్తి మీద ఖర్చు పిడుగు పడుతది. అవి కరాబ్ అయితే రిపేర్ చేయాలంటే మళ్లా అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తది. కేసీఆర్ ప్రభుత్వంలో మోటర్లు కాలుడు లేదు. ఇంత మంచి సౌలత్ ఉండంగ.. మళ్లగా కాంగ్రెసోళ్లు వచ్చి ఏ జేస్తరు. కాంగ్రెస్ వస్తే మళ్లా అప్పుల బారిన పడుడే. అలాంటి వాళ్లకు అధికారం ఇచ్చి మన నోట్లో మట్టి పోసుకునుడు ఎందుకు. ఢిల్లీ లీడర్ల పెత్తనం మన మీద ఉంటది. గందుకే రైతులెవ్వరూ కాంగ్రెస్‌కు ఓటెయ్యరంట. కేసీఆర్ ప్రభుత్వానికే వేస్తరట.



**- చిల్లా రామకృష్ణ, రైతు, కుమ్మరికుంట**